జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 26-09-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 135 పేజీలు: 8 వెల : రూ.7

# పట్టపగలు.. దోపిడి




**✳ పీక మీద కత్తి పెట్టి ఐదు తులాల పుస్తెలు, నల్లపూసలు చోరీ ✳ 60 ఏళ్ల మహిళపై దాడి ✳ భర్త ఇంట్లో ఉండగానే సంఘటన ✳ సోంపేటలో కలకలం ✳ పోలీసులకు సవాల్ విసురుతున్న చైన్‌స్నాచర్లు**



**శ్రీకాకుళం క్రైం/సోంపేట,సెప్టెంబర్ 25 (వార్త):** జిల్లాలో చైన్‌స్నాచర్లు పేట్రేగిపోతున్నారు. పట్టపగలే దోపిడీకి పాల్పడుతున్నారు. సోంపేట పట్టణంలో బుధవారం ఉదయం పది గంటలకు మహాదేవి పేట వీధిలో గుంటు కామేశ్వరరావు ఇంట్లోకి దుండగులు చొరబడి అతని భార్య జీవరత్నం మెడపై కత్తి పెట్టి ఆమెను బెదిరించి ఐదు తులాల బంగారం తెంపుకొని పోయారు. బాధితుల ఇంటికి సమీపంలోనే డిసిసిబి బ్యాంక్ సిసి ఫుటేజీని పోలీసులు పరిశీలిస్తే దుండగుడు హెల్మెట్ పెట్టుకొని నడుచుకుంటూ వెళ్తున్న దృశ్యం బయటికి రాగా, మరో వ్యక్తి హెల్మెట్ పెట్టుకుని నెంబర్ ప్లేట్ లేని బండిపై సిద్ధంగా ఉన్నట్టు వీడియోలు బయటకు వచ్చాయి. బాధితరాలు జీవరత్నం, స్థానికులు తెలిపిన వివరాల మేరకు... బుధవారం ఉదయం 9.45 నిమిషాలకు గుర్తుతెలియని వ్యక్తి గుంటుకు కామేశ్వరరావు ఇంటి వద్దకు చేరుకొని మీ అబ్బాయి ఇంట్లో ఉన్నారా? అనే ప్రశ్నకు లేరని జవాబు జీవరత్నం ఇచ్చారు. దీంతో, తాగేందుకు మంచినీళ్లు కావాలని ఆ వ్యక్తి అడిగేసరికి బాటిల్ తో తాగునీటిని జీవరత్నం తీసుకువచ్చే లోపల, ఆ వ్యక్తి ఇంట్లోని మొదటి గదికి చేరుకున్నాడు. ఆమెను నెట్టివేసి తన వద్ద ఉన్న కత్తిని తీసి పీక మీద పెట్టి బంగారాన్ని ఇవ్వాలని హెచ్చరించాడు. ఆమె ప్రతిఘటించేలోగా 60 సంవత్సరాల వయసున్న జీవరత్నం మెడలో ఉన్న పుస్తెలు, నల్లపూసలు సుమారు 5 తులాలు బంగారాన్ని తెంపుకొని పారిపోయాడు. దీంతో ఆమె చేతికి గాయం కూడా అయ్యింది. ఈ సంఘటన జరుగుతున్న సమయంలో జీవరత్నం భర్త కామేశ్వరరావు భగవద్గీత చదువుకుంటూ ఇంటిలోనే ఉన్నారు. ఆయనకు వినికిడి లోపం కారణంగా ఏమి చేయలేకపోయారు. స్థానిక జగన్నాథ స్వామి దేవాలయం వీధిలో జరిగిన ఈ దాడి, బంగారు దోపిడి సంఘటన స్థానికంగా తీవ్ర ఆందోళనను రేకెత్తించింది. ఆ వీధిలో గోల్డ్ స్మిత్ ఉన్నారనే సమాచారంతో దుండగులు రెండు రోజులుగా రెక్కీ నిర్వహించినట్టు తెలుస్తోంది. సంఘటన జరిగిన ప్రాంతానికి స్థానిక సర్కిల్ అధికారి మంగురాజు,ఎస్సై హైమావతి వెళ్లి బాధితురాలతో మాట్లాడి పరిసరాలను పరిశీలించారు.

# గంజాయి రహిత జిల్లాగా మారుస్తా

**✳ సరిహద్దు గ్రామాల్లో నిత్యం నిఘా ✳ అంతరాష్ట్ర ముఠాను అదుపులోకి తీసుకున్నాం ✳ జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ✳ పెద్ద ఎత్తున గంజాయి స్వాధీనం**



**పలాస, సెప్టెంబర్ 25 (వార్త):** శ్రీకాకుళం జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నామని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో మీడియాతో మాట్లాడారు. అంతరాష్ట్ర గంజాయి ముఠాను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. గత కొంత కాలంగా ఆంధ్రా – ఒడిశా బోర్డర్ కేంద్రంగా గంజాయి అక్రమ రవాణా జరుగుతోందన్నారు. అంతర్రాష్ట్ర గంజాయి ముఠా సభ్యులు ఒడిశా లో గంజాయి కొనుగోలు చేసి ఇచ్ఛాపురం కేంద్రంగా ఇతర రాష్ట్రాలకు విక్రయిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లా పోలీసులు గంజాయి అక్రమ రవాణాను శాశ్వతంగా నిర్మూలించాలనే ధ్యేయంతో గంజాయి అక్రమ రవాణాదారులపై డేగ కళ్లతో నిఘా పెట్టినట్లు తెలిపారు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన బబ్లూ, నాసిక్ జిల్లా మహారాష్ట్రకు లలిత ప్రదీప్‌లు ఒడిశా రాష్ట్రం గంజాంలో 83.3 కేజీల గంజాయి కొనుగోలు చేశారని వెల్లడించారు. ఇచ్ఛాపురం వరకు బస్సులో ప్రయాణం చేసిన గంజాయి ముఠాదారులు ఇచ్ఛాపురంలో రెలు ఎక్కి గుంతకల్లు చేరుకుని అక్కడ నుంచి సూరత్ కు ట్రైన్‌లో వెళ్లేందుకు ప్రయత్నించగా ఇచ్ఛాపురం పోలీసులు పట్టుకున్నారని ఎస్పీ మహేశ్వర రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో బైక్‌ను దొంగిలించి ఒడిశాకు వచ్చిన మరో గంజాయి స్మగ్లర్ ఒడిశా రాష్ట్రంలో 1.3 కిలోల గంజాయి కొనుగోలు చేసి బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తుండగా పలాస బైపాస్ రోడ్డులో మొగిలిపాడు దగ్గర కాశీబుగ్గ పోలీసులు పట్టుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. రెండు ఘటనల్లో పట్టు బడిన గంజాయి విలువ సుమారు రూ.4 లక్షలు వరకు ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఎన్‌డిపీఎస్ యాక్ట్ కింద ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. గడిచిన 20 రోజుల్లో 230 కేసులు నమోదు చేసి 31 మందిని అరెస్ట్ చేశామన్నారు. గంజాయికి బానిసలైన మరో 17 మందిని రిహాబిలిటేషన్ సెంటర్‌కు పంపించి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. ఈ సమావేశంలో పలాస, ఇచ్ఛాపురం, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాల సెంట్రింగ్ కూలి.. విద్యార్థి మృతి

**✳ మరో విద్యార్థికి గాయాలు ✳రిమ్స్‌లో వైద్యసేవలు ✳ పరామర్శించిన కలెక్టర్**



**శ్రీకాకుళం క్రైం, సెప్టెంబర్ 25 (వార్త):** రణస్థలం మండలం పాతర్లపల్లిలో బుధవారం విషాదం చోటు చేసుకుంది. జడ్పీ హైస్కూల్ ఆవరణలో నిర్మాణంలో ఉన్న అదనపు భవనం సజ్జ కూలి పదో తరగతి చదువుతున్న వి.కృష్ణంరాజు (15) మృతి చెందాడు. అలాగే 9వ తరగతి చదువుతున్న కోరాడ శ్రీరాములు అనే విద్యార్థికి తీవ్రగాయాలయ్యాయి. క్రికెట్ ఆడుతుండగా బాల్ కోసం నిర్మాణంలో ఉన్న భవనం వైపు విద్యార్థులు వెళ్లగా ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన విద్యార్థికి రిమ్స్‌లో వైద్యసేవలు అందిస్తున్నారు. విద్యార్థి ఆరోగ్యం కుదుటపడిందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షకీల తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ రిమ్స్‌కు విద్యార్థి కుటుంబీకులు, వైద్యులతో మాట్లాడారు. అలాగే జిల్లాలో భవన నిర్మాణంలో ఉన్న పాఠశాలల వద్ద తక్షణం నిర్మాణ ప్రాంతాల్లో కంచెను ఏర్పాటు చేయాలని విద్యాశాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే విద్యార్థి మృతిపై వ్యవసాయ శాఖ మంత్రి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం నాడు నేడు పనుల్లోనాణ్యత లోపించడంతో ఈ ప్రమాదం జరిగిందని అన్నారు.



## రోడ్డుపై మురుగు.. తప్పని అవస్థలు



జలుమూరు, సెప్టెంబర్ 25 (వార్త): జలుమూరు మండలం కరకవలస పంచాయతీ పరిధిలోని కాలనీలో మట్టి రోడ్డుపై మురుగునీరు చేరిపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని కాలనీవాసులు తెలిపారు. కాలనీలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఈ పరిస్థితి ఎదురవుతుందని వివరించారు. వర్షం పడితే మురుగునీరు వర్షపు నీరు కలిసి రోడ్డుపైకి రావడంతో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయని వాపోయారు. రోగాలు వచ్చే పరిస్థితి కూడా ఉందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# మాదక ద్రవ్యాలతో అనర్థమే

పాతపట్నం, సెప్టెంబర్ 25 (వార్త): పాతపట్నంలోని కిరణ్మయి జూనియర్ కళాశాలలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలపై బుధవారం ఏఎస్ఐ టి.శ్రీనివాసరావు విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కల్పించారు. మైనర్స్ డ్రైవింగ్ చేయడంలో కలిగే ప్రమాదాలను వివరించారు. మైనర్లు డ్రైవింగ్ చేస్తే వాహన యజమానిపై ఎంవీ యాక్టు ప్రకారం చర్యలు కుంటామని హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రతిరోజూ కాలేజీలు, స్కూల్స్ వద్ద ఈ కార్యక్రమాలు




చేపడతామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జగన్మోహన్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మావోయిజాన్ని అణిచివేసే శక్తి లేదు

**- 'ఉన్నం 'సంతాప సభలో వక్తలు**

పలాస, సెప్టెంబర్ 25 (వార్త): మావోయిజాన్ని అణిచివేసే వేసే శక్తి ఏ ప్రభుత్వానికి లేదని, ప్రజల్లో అసమానతలు, పీడన ఆగేంతవరకు మావోయిజం ఉంటుందని అమరుల బంధుమిత్రుల కమిటీ జిల్లా అధ్యక్షుడు జోగి కోదండం, రైతాంగ సాధన కమిటీ అధ్యక్షులు దాసరి శ్రీరాములు, వ్యవసాయ కార్మిక సమైక్య జిల్లా కార్యదర్శి పుచ్చ దుర్యోధన అన్నారు. పలాస మండలం బొడ్డపాడులో ప్రజా కళా మండలి వ్యవస్థాపకుడైన ఉన్నం నాగేశ్వరరావు సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆనాడు శ్రీకాకుళం నక్సల్బరి ఉద్యమాన్ని అణచివేశామని అప్పటి హోం మంత్రి జలగం వెంగళరావు గొప్పలు



చెప్పాడని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కానీ ఉద్యమం ఆగలేదని, దేశమంతా పాకిందని తెలిపారు. మావోయిస్టు పార్టీని 2026 నాటికి లేకుండా చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారని, అది సాధ్యం కాదని స్పష్టం చేశారు. మావోయిస్టు పార్టీని అణిచివేసేందుకు కగారు పేరుతో కొత్త సైన్యాన్ని దించారని కేంద్రంపై మండిపడ్డారు. ఆదివాసులు అడవుల నుంచి పంపించాలనే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. నాగేశ్వరరావుకు బొడ్డపాడుకు ప్రత్యేక విప్లవ సంబంధం ఉందని గుర్తు చేశారు. రాష్ట్ర అభివృద్ధి సంఘం నాయకులు కోనేరు రమేష్ మాట్లాడుతూ గిరిజన సమస్యల కోసం మరో ఉద్యమం జరగాలని కోరారు. అమరవీరుల బంధుమిత్రుల కమిటీ నాయకుడు బొడ్డపాడు మాజీ సర్పంచ్ తామాడ త్రిలోచనరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బొడ్డపాడు యువ సంఘం అధ్యక్షుడు తామాడ క్రాంతి, వ్యవసాయ కార్మిక సమైక్య జిల్లా అధ్యక్షుడు మద్దిల ధర్మారావు, బొడ్డు సింహాద్రి, రాజాం గుణవంతులు తదితరులు పాల్గొన్నారు.

# లడ్డూను కల్తీ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి




పోలాకి, సెప్టెంబర్ 25 (వార్త): ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా గంటపేటలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో నరసన్నపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి బలగ ప్రవీణ్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తిరుమల వెంకన్న అన్న ప్రసాదం, లడ్డూలో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కలపడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై ఉన్నతస్థాయి అధికారులతో సమగ్ర విచారణ చేపట్టారన్నారు. శ్రీవారి భక్తుల మనోభావాలతో ముడిపడిన ఈ అంశంలో కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి యోగహరి, పోలాకి మండలం వీరమహిళ లావేటి బుజ్జమ్మ, సవర ధనుంజయ్, కృష్ణ, పోలాకి గ్రామ వీర మహిళలు, జనసేన పార్టీ కార్యకర్తలు, గ్రామ జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

# పోలాకి, సారవకోట, జలుమూరుకు నూతన ఎంపీడీవోలు

పోలాకి, సెప్టెంబర్ 25 (వార్త): పోలాకి మండల అభివృద్ధి అధికారిగా గరిమెళ్ల వెంకట రవికుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన సంతకవిటి నుంచి ఇక్కడకు వస్తున్నారు. ఇక్కడ పనిచేసిన ఉషశ్రీ విశాఖకు బదిలీ అయ్యారు.

సారవకోట, సెప్టెంబర్ 25 (వార్త): సారవకోట మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పీవీవీ మోహన్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈయన సరుబుజ్జిలి నుంచి ఇక్కడకు రానున్నారు. త్వరలోనే బాధ్యతలను స్వీకరిస్తానని ఆయన తెలిపారు.





పోలాకి, సారవకోట, జలుమూరు నూతన ఎంపీడీవోలు వెంకటరవికుమార్, మోహన్‌కుమార్, అప్పలనాయుడు

జలుమూరు, సెప్టెంబర్ 25 (వార్త): జలుమూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా అప్పలనాయుడును నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. గతంలో ఈయన పాతపట్నంలో పరిపాలన అధికారిగా విధులు నిర్వహించారు. అక్కడి నుంచి పదోన్నతిపై విశాఖ జిల్లా ఎలమంచిలి ఎంపీడీవోగా బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఎలమంచిలి నుంచి ఇక్కడకు బదిలీ చేశారు. ఆయన శుక్రవారం విధుల్లో చేరుతారు.

## నూతన పద్ధతులతో వ్యవసాయం లాభసాటి



నరసన్నపేట, సెప్టెంబర్ 25 (వార్త):చెన్నాపురం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి సునీత ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి వ్యవసాయ సైంటిస్ట్ భాగ్యలక్ష్మి, ఏడీ రవీంద్రభారతి ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. వ్యవసాయంలో నూతన పద్ధతులను, సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని రైతులకు సూచించారు. అలా చేస్తే వ్యవసాయం లాభసాటిగా మారుతుందన్నారు. కార్యక్రమంలో రైతులు, అధికారులు పాల్గొన్నారు.

## చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్



జలుమూరు, సెప్టెంబర్ 25 (వార్త): జలుమూరులోని కేవీఎన్‌జీహెచ్ పాంశాలలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ బుధవారం నిర్వహించామని హెచ్‌ఎం వేణుగోపాలరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులలో మూఢ నమ్మకాలను నశింపజేయాలనే ఉద్దేశంతో ఈ పరీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులను శాస్త్రీయ దృక్పథం వైపు అడుగులు వేసేలా ఈ పరీక్షలు దోహదపడతాయన్నారు. ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఏ విటమిన్‌తో కంటి చూపునకు రక్షణ



నరసన్నపేట, సెప్టెంబర్ 25 (వార్త): నరసన్నపేట మండలం కంబకాయ గ్రామంలోని జడ్పీహెచ్ స్కూల్‌లో విద్యార్థులకు కంటి వైద్యుడె డా.వీబీజీ రాజు బుధవారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 222 మంది విద్యార్థులను పరీక్షించగా, 26 మందిని కళ్లద్దాలకు రిఫర్ చేశామన్నారు. విటమిన్ ఏ ఉండే ఆకుకూరలు తదితర ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు, వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల మరుగుదొడ్ల పనుల వేగవంతం

సారవకోట, సెప్టెంబర్ 25 (వార్త): చీడిపూడి గ్రామంలో అంగన్‌వాడీ-1, 2 కేంద్రాలకు చెందిన మరుగుదొడ్ల నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. ఈ కేంద్రాలకు మరుగుదొడ్లు పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని అంగన్‌వాడీ సిబ్బంది స్థానిక టీడీపీ నాయకులు నిక్కు జనార్దనరావు, కింజరాపు రామారావు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వారు స్పందించి ఎమ్మెల్యేకు, అధికారులకు సమస్యను వివరించి, నిధులు మంజూరు చేయించారు. దీంతో నిర్మాణ పనులు చేపట్టారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ప్రభుత్వాసుపత్రి వద్ద బెంచీల ఏర్పాటు

నరసన్నపేట, సెప్టెంబర్ 25 (వార్త): నరసన్నపేటలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి వద్ద బుధవారం సామాజిక కార్యకర్త మార్పు విజయకుమార్ రూ.40,000లతో నాలుగు సిమెంట్ బెంచ్‌లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి రోగులతో పాటు వచ్చిన వారికి కూర్చోవడానికి వీలుగా ఉంటుందన్న ఉద్దేశంతో బెంచీలను ఏర్పాటు చేశామన్నారు. ఆసుపత్రికి వచ్చేవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



# వాడీవేడిగా..!

- జలుమూరు మండల సమావేశం
- దూషించుకున్న ఎంపీపీ, నగరికటకం ఎంపీటీసీ సభ్యుడు
- సర్ది చెప్పిన ఎమ్మెల్యే బగ్గు




మండల సమావేశానికి హాజరైన సభ్యులు , అధికారులు

జలుమూరు, సెప్టెంబర్ 25 (వార్త): ఏ..ఏ గ్రామాల్లో రోడ్లు, కాలువలు అవసరమో జిల్లా కలెక్టర్ నివేదిక ఇమ్మంటే.. ఎంపీటీసీ సభ్యులకు తెలియకుండా ..ఈవోపీఆర్డీ, ఎంపీపీ కలిసి పనులు నిర్ధారించడం ఏంటని నగరికటకం ఎంపీటీసీ సభ్యుడు బగ్గు రామకృష్ణ ఎంపీడీవోను నిలదీశారు. బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఆయనకు ..ఎంపీపీ వాన గోపి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. నువ్వెంత అంటే నువ్వెంత అనే స్థాయి వరకు ఇద్దరి మధ్య మాటల యుద్ధం నడిచింది. దీంతో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కలుగజేసుకుని వారిద్దరిని సముదాయించి, గొడవ సద్దుమణిగేలా చేశారు. ఎవరైనా ప్రజలు ఓటేస్తే గెలిచామని, ఆ గ్రామ ప్రజలకు ఎటువంటి అవసరాలు ఉన్నాయో తెలుసుకొని, తీర్చడానికి ప్రస్తుత ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రతి గ్రామంలో ఏ..ఏ ముఖ్య పనులు ఉన్నాయో తనకు గానీ, మండల ప్రజా పరిషత్ ద్వారా గానీ తెలియపరిస్తే తప్పకుండా తీరుస్తానని ఆయన తెలిపారు. పార్టీలకతీతంగా ప్రజలకు సేవ చేయాలని సూచించారు. దీంతో సభలో ఉన్న ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు చప్పట్లతో సమావేశం ముగిసింది. సమావేశంలో ఉద్యోగులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



## రాష్ట్రస్థాయి పోటీలకు చంద్రకళ

నరసన్నపేట, సెప్టెంబర్ 25 (వార్త):నరసన్నపేటలోని ప్రభు త్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని గోకవలస చంద్రకళ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం సాయి శ్రీనివాస్ బుధవారం తెలిపారు. జిల్లా స్థాయిలో రెండు రోజుల క్రితం జరిగిన పోటీల్లో ప్రతిభ చూపడంతో రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థిని చంద్రకళను పీడీ కె.గణపతిరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

## మెనూ ప్రకారమే 'మధ్యాహ్న భోజనం'




నరసన్నపేట, సెప్టెంబర్ 25 (వార్త): ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని మెనూ ప్రకారం తప్పనిసరిగా నిర్వహించాలని ఎంఈఓలు ఉప్పాడ శాంతారావు, పేడాడ దాలినాయుడు ఆదేశించారు. బుధవారం నరసన్నపేట మండలం బాడాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు ఇస్తున్న ఆహారం వేడిగా అందివ్వాలని, గోరువెచ్చని తాగు నీటిని అందజేయాలని వారు సూచించారు.

## బోరు పరిసరాలు శుభ్రం చేయాలి



నరసన్నపేట, సెప్టెంబర్ 25 (వార్త): నరసన్నపేట మండలం చిన్నకరగాం గ్రామంలోని మంచినీరు బోరు కిందకు కుంగిపోవడంతో చుట్టుపక్కల ఉన్న మురుగు చేరి దుర్వాసన వస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. దీంతో ఈ మంచినీరు తాగడానికి ఇబ్బంది పడుతున్నామన్నారు. అధికారులు స్పందించి వెంటనే బోరు పరిసరాలు శుభ్రం చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## రెండు ట్రాక్టర్లు స్వాధీనం



పోలాకి, సెప్టెంబర్ 25 (వార్త):పోలాకి మండలంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకున్నామని ఎస్సై జి.రంజిత్ తెలిపారు. కొవిరిపేట వద్ద అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ను తన సిబ్బందితో కలిసి పట్టుకున్నామన్నారు. చీడివలస గ్రామం వద్ద కూడా అనుమతులు లేని ఇసుక ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్నామని ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

## స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెలక్షన్స్ ప్రారంభం

నరసన్నపేట, సెప్టెంబర్ 25 (వార్త): నియోజకవర్గ స్థాయి బాలికల స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెలక్షన్స్ నరసన్నపేట కాలేజీ గ్రౌండ్లో బుధవారం నిర్వహించామని ఎంఎస్‌వో భుజంగరావు తెలిపారు. నియోజకవర్గ బాలికలు ఆటల పోటీలకు హాజరై వాళ్ల ప్రతిభను కనబరిచారన్నారు. ఈ పోటీలను వైస్ సర్పంచ్ చిట్టిబాబు, హెచ్‌ఎం పోటీలను ప్రారంభించారని తెలిపారు. కార్యక్రమంలో మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ ఆనంద్, వివిధ మండలాల ఎంఎస్‌వోలు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





## గాన గంధర్వునికి ఘన నివాళి

కంచిలి, సెప్టెంబర్ 25 (వార్త) : జాడుపూడిలో బుధవారం గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు ఘనంగా నివాళులర్పించారు. ఆయన నాల్గవ వర్ధంతి సందర్భంగా ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట మండలాల కళాకారులు బాలు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాలు పాడిన కొన్ని చిత్ర గీతాలు కళాకారులు ఆలపించారు. కార్యక్రమంలో కళాభారతి కళాకారుల సంక్షేమ సంఘ సభాధ్యక్షుడు పిలక సోమేశ్, దేవేంద్రనాథ్ పండా, సర్పంచ్ ప్రతినిధి పలికల జయరాం, పిలక చిన్నబాబు, నర్తు కృష్ణారావు, మద్దిల హేమసుందర్, దుద్ది తులసి, ఎంకేరావు, ప్రసాద్, నిరంజన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 'ఇల్లు నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి'

జలుమూరు, సెప్టెంబర్ 25 (వార్త): గతంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని జలుమూరు మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి అన్నారు. బుధవారం ఆమె ఎంపీడీవో ఉమామహేశ్వరరావుతో కలసి 'మన ఇల్లు మన గౌరవం' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రత్యేకాధికారులను సచివాలయ స్థాయిలో నియమించామన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న జలుమూరు మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి



## లింగాలవలసలో సైన్స్ టాలెంట్ టెస్ట్

జలుమూరు, సెప్టెంబర్ 25 (వార్త): జలుమూరు మండలం లింగాలవలస జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించామని హెచ్‌ఎం ముంగటి అప్పలసూర్యనారాయణ తెలిపారు. విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథంపై అవగాహనకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల జన విజ్ఞాన వేదిక కన్వీనర్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పశు వైద్యుడు లేక పాడి రైతుల ఇబ్బందులు

నరసన్నపేట, సెప్టెంబర్ 25 (వార్త): నరసన్నపేట మండలం కంబకాయ పశు వైద్య కేంద్రంలో పశు వైద్యుడు లేకపోవడంతో పశువులకు వైద్యం లభించడం లేదని పాడిరైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ వైద్యుడు లక్ష్మణరావు డిప్యూటేషన్ ఇతర ప్రాంతానికి వెళ్లిపోయారు. ఈయన స్థానంలో డిప్యూటేషన్లో నియమించిన షణ్ముఖరావు నెల రోజులుగా రావడం లేదు. పశువులకు వ్యాధులు సోకితే ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సివస్తుందని పాడిరైతులు బుధవారం వాపోయారు. వైద్యుడును నియమించాలని వారు కోరుతున్నారు.



### -ఇంటింటికీ వెళ్లి అవగాహన

వంద రోజుల ప్రగతిపై ప్రచారం.

గార, సెప్టెంబర్ 25 (వార్త): ఎన్టీయే కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే ప్రతి ఇంట సంబరాలు వచ్చాయని టీడీపీ శ్రీకాకుళం నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతీశంకర్ అన్నారు. గార మండలంలోని శాలిహుండం పంచాయతీ కొత్తపేట గ్రామంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మాజీ ఎంపీపీ గొండు భాస్కర్, సర్పంచ్ కొంక్యాణ ఆదినారాయణ ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముందుగా ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లను అంటించారు. వంద రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల కరపత్రాలను ఇంటింటికీ అందజేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వంద రోజుల్లో అవ్వా,తాతలకు నెలకు రూ. 4 వేలు పింఛన్, దివ్యాంగులకు నెలకు రూ. 6వేలు అందిస్తున్నామని తెలిపారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేసి ప్రజల ఆస్తుల భద్రత కల్పించామని పేర్కొన్నారు. నిరుద్యోగుల కోసం మెగా డీఎస్సీ ప్రకటన, అనేక మంది పేదల ఆకలి తీర్చుతున్న అన్న క్యాంటీన్ల ఏర్పాటు జరిగిందన్నారు. రైతుల వద్ద నుంచి ధాన్యం సకాలంలో కొనుగోలు చేసి ఆదుకున్నామని వివరించారు. ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



### -బాబుతోనే అభివృద్ధి సాధ్యం

పోలాకి, సెప్టెంబర్ 25 (వార్త): పోలాకి మండలం జడూరు పంచాయతీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం స్థానిక మాజీ సర్పంచ్ గొండు కేశవరావు ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ నాయకులు కార్యక్రమాన్ని చేపట్టారు. 100 రోజుల్లో మెరుగైన పరిపాలన టీడీపీ ప్రభుత్వం అందించిందని వారు గ్రామస్తులకు తెలియజేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలను తెలియజేస్తూ కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు.



# వంద రోజుల్లోనే సంతృప్తికర పాలన

సారవకోట, సెప్టెంబర్ 25 (వార్త): సారవకోట మండలం గుమ్మపాడులో స్వర్ణాంధ్ర 2047 కరపత్రంపై ప్రజలకు అవగాహన కల్పించామని టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా వాళ్ల అభిప్రాయాన్ని మొబైల్ ద్వారా తెలియజేయవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలను స్కాన్ చేసి పొందుపరచాలని కోరారు.

కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.






జలుమూరు, సెప్టెంబర్ 25 (వార్త): జలుమూరు మండలం, వెంకటాపురం గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మంచి పాలన అందిస్తుందన్నారు. అవ్వ,తాతల పెన్షన్ 4000, వికలాంగుల పెన్షన్ 6000, లక్షలాదిమంది పేదల ఆకలి తీర్చే "అన్న క్యాంటీన్లు", యువత భవిష్యత్తుకు "మెగాడీఎస్సీ" ప్రజల ఆస్తుల భద్రతకు ల్యాండ్ టైటిలింగ్‌యాక్ట్ రద్దు లాంటి కార్యక్రమాలతో ముందుకు సాగుతుందన్నారు.

కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెలమల రాజేంద్రనాయుడు, జడ్పీటీసీ ప్రతినిధి మెండ రాంబాబు, సర్పంచులు దుంగ స్వామిబాబు, బగ్గు గోవిందరావు , దుంగ మన్మధరావు, వెలమల చంద్ర భూషణ్ గారు, మునికోటి దాంబాబు , తర్ర బలరాం, తహసీల్దార్, ఎంపీడీవో, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు అధికారులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### కూర్మనాథపురంలో ..

జలుమూరు, సెప్టెంబర్ 25 (వార్త): జలుమూరు మండలం కూర్మనాథపురంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ సర్పంచ్ మొయ్య సుజాత, సచివాలయం ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి స్టికర్స్ ఇచ్చి ప్రభుత్వం చేసిన పనులు తెలియజేశారు. కార్యక్రమంలో బోడాల బాలకృష్ణ, చల్ల రాజారమేష్‌నాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.





పలాస, సెప్టెంబర్ 25 (వార్త): పలాస మండలం బొడ్డపాడులో స్వర్ణాంధ్ర వాల్‌పోస్టర్ ప్రచార కార్యక్రమం బుధవారం జరిగింది. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల తెలుగుయువత అధ్యక్షులు కె. ఢిల్లీరావు, గర్భాపు తులసీ రావు, బొడ్డు మోహన్, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

### గోకర్ణపురంలో ..

కంచిలి, సెప్టెంబర్ 26 ( వార్త ) : గోకర్ణపురంలో తెలుగుదేశం పార్టీ మండల కార్యదర్శి మాదిన రామారావు ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం బుధవారం జరిగింది. ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నా రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి అనుక్షణం తప్పిస్తున్నారని రామారావు అన్నారు. ఆయన పనితీరును ఆదర్శంగా తీసుకుని రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రతి ఒక్కరం కృషి చేయాలని కోరారు. రాబోయే రోజుల్లో ప్రతి హామీని నిలబెట్టుకుని ఇది మంచి ప్రభుత్వమని ప్రజలతోనే చెప్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, మండల అధికారులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## జ్ఞాన భారతిలో స్వచ్ఛత హీ సేవ



**ఇచ్ఛాపురం, సెప్టెంబర్25 (వార్త):** సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు బుధవారం జ్ఞాన భారతి స్కూల్లో స్వచ్ఛత హే సేవా క్యాంపెయిన్ -2024 కార్యక్రమాలలో భాగంగా జ్ఞాన భారతి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సెక్రెటరీ, సీఈవో జోహార్ ఖాన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐబి పండా, హెడ్ మిస్ట్రెస్ రషీదా సుల్తానా,మేనేజర్ ప్రమోద్ కుమార్, అదనపు పరిపాలనా అధికారిని సయ్యదా సుల్తానా, ట్రాన్స్పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్, వ్యాయామ ఉపాధ్యాయులు కైలాష్ పండా, రాము తదితరులు పాల్గొన్నారు.

### ఆరోగ్య సంరక్షణలో ...

# ఫార్మసిస్టులదే ప్రముఖ పాత్ర

* రిమ్స్ ప్రిన్సిపాల్ వెంకటాచలం
* ఘనంగా వరల్డ్ ఫార్మసిస్ట్ డే




**శ్రీకాకుళం, సెప్టెంబర్ 25(వార్త):** ఆరోగ్య సంరక్షణలో ఫార్మసిస్టులదే పాత్రని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని బుధవారం రిమ్స్ మెడికల్ కాలేజీ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. జోన్- 1 ఫార్మసిస్ట్ అసోసియేషన్ శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం అధ్యక్షుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న రిమ్స్ కాలేజీ ప్రిన్సిపాల్ కె.రవి వెంకటా చలం మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణలో ఫార్మసిస్టులది కీలక పాత్ర ఉంటుందని తెలిపారు. ఫార్మసిస్టులను గౌరవించడానికి ఫార్మసిస్టు దినోత్సవాన్ని ప్రపంచం మొత్తం నిర్వహిస్తుందని గుర్తు చేశారు. రిమ్స్ సూపర్డెంట్ డాక్టర్ డి షకీలా మాట్లాడుతూ కరోనా సమయంలో ఫార్మసిస్టులు పాత్ర అమోఘమని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య అభివృద్ధికి ఫార్మసిస్టులు చేసే సహకారాన్ని ప్రతి ఒక్కరూ మెచ్చుకుంటూ ఉంటారని అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మీనాక్షి మాట్లాడుతూ ఆసుపత్రి ఆవరణలో అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలు అందించేందుకు ఫార్మసిస్టులు ముందు ఉంటారని తెలిపారు. సీనియర్ లెక్చరర్ ఇన్ ఫార్మసీ బివిఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ మనుషులకు ప్రాణం పోసేది వైద్యులైతే వారు వాడే మందులకు ప్రాణం పోసేది ఫార్మసిస్టులని అన్నారు. ఎన్నో రోగాలకు మందులు రావడానికి కారణం ఈ ఫార్మసిస్టులే అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలని వివరించారు. ఫార్మసిస్ట్ చేసే రీసెర్చ్ కారణంగా ఎన్నో రోగాలకు మందులు వస్తున్నాయని తెలిపారు. శ్రీకాకుళం ఫార్మసిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా బతకడానికి మందుల రూపంగా వ్యాక్షిన్ రూపంగా సృష్టిస్తున్న బ్రహ్మలు ఫార్మసిస్టులే అని అన్నారు. కోవిడ్ మహమ్మారి నుండి ప్రజలను రక్షించే దేవుళ్ళు కూడా ఫార్మసిస్టులని పేర్కొన్నారు. నవజాత శిశువులను వ్యాధి భారీ నుండి తప్పించుకోవడానికి వారికి ఆరోగ్యంగా ఉండేందుకు వ్యాక్సిన్ రూపంలో కనుగొన్నది కూడా ఫార్మసిస్టులే అని పేర్కొన్నారు. ఇండియన్ ఫార్మాకోపియా, బ్రిటిష్ ఫార్మాకోపియా, యునైటెడ్ ఫార్మకోపియా అనే గ్రంధాల నుండి వివిధ ఔషధాలను జతపరచి అవి మానవ మనుగడకు దోహదపడే కోర్సులే ఫార్మసీ చదువులని వివరించారు. ఇటీవల ఏర్పడిన శ్రీకాకుళం ఫార్మసిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్ సుబ్రహ్మణ్యం, కార్యదర్శి మల్లేశ్వరరావు సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులకు ఫార్మసిస్టులకు గౌరవ సన్మానాలు చేసి షీల్డ్ అందించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్ ప్రశాంత్, ఏపి ఎన్జీవో జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం, రిమ్స్ డాక్టర్ బాల సుహాసిని, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.గోపాల్, బిఎస్ నాయుడు, జనార్ధన, రామారావు, రమేష్, ఆదిలక్ష్మి, ప్రీతి, శ్రీనివాస్, ధనుంజయ, చక్రవర్తి, సోమేశ్వరరావు, నరసింగరావు, శ్రావణి, శ్రీకాకుళం విజయనగరం విశాఖపట్నం జిల్లాల ఫార్మసీ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఐదేళ్లుగా ఆ మంత్రి సాగునీరు ఇవ్వలేదు

* వంద రోజుల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్నా...
* పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష



**పలాస, సెప్టెంబర్ 25(వార్త):** కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజుల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్నామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. గత ప్రభుత్వం రైతులకు ఐదేళ్లుగా సాగునీరు ఇవ్వలేదన్నారు. పలాస మండలం బ్రాహ్మణతర్ల గ్రామంలో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ను రద్దు చేయడంతో పాటు మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసారన్నారు. ఒకటో తేదిన ఇంటింటికీ వచ్చి పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఐదేళ్ళు వంశధార నీరు అందించలేక పోయారన్నారని, ఎమ్మెల్యేగా గెలిచిన వారం రోజుల్లో వంశధార నీరు శివారు భూములకు అందించడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటోందని వంద రోజుల్లో చేసి చూపించామని తెలిపారు. అనంతరం ఐసిడిఎస్ ఆద్వర్యంలో గర్భిణీలకు సీమంతాలు చేశారు. గర్భిణీలు బాలింతలు చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు విఠల్ రావు, కుత్తుం లక్ష్మణ్ కుమార్, దువ్వాడ సంతోష్ కుమార్, వడ్డీ యాదగిరి, ఆళ్ళ కృష్ణారావు, ఆళ్ళ వెంకటరావు, ఆర్ సుదర్శన రావు, బమ్మిడి ఆనందరావు, ఎంపీడీవో ఎన్ రమేష్ నాయుడు, పంచాయితీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠ రావు, పంచాయితీ కార్యదర్శి లక్ష్మణ రేఖ, వివిధ మండల శాఖ అధికారులు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### కొబ్బరి చెట్లూరులో... ఇది మంచి ప్రభుత్వం...

చిన్ననీలావతి, కొత్తూరు, కొబ్బరిచెట్లూరు గ్రామాలలో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు పుచ్చ భాస్కరరావు, సొర్ర కామేశ్వరరావు, జనసేన నాయకులు వమ్మరవల్లి అనిల్

# మనది.. మంచి ప్రభుత్వం

* మూలపేట పోర్టు, భోగాపురం ఎయిర్ పోర్టులతో యువతకు ఉపాధి
* కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు
* కుందువానిపేటలో 'ఇది మంచి ప్రభుత్వం'



**శ్రీకాకుళం, సెప్టెంబర్25 (వార్త):** జిల్లా మత్స్యకారులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, మూలపేట పోర్టు, భోగాపురం ఎయిర్‌పోర్టుల నిర్మాణం పూర్తయితే జిల్లాకు చెందిన యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. బుధవారం శ్రీకాకుళం రూరల్ మండలం కుందువానిపేట గ్రామంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్‌లతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఇచ్చిన మాటకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కుందువానిపేట గ్రామాన్ని పర్యాటక ప్రాంతంగా ఏర్పాటు చేస్తామని, విశాఖపట్నం నుండి మూలపేట పోర్టు వరకు బీచ్ కనెక్టివిటీ రహదారి ఏర్పాటు చేస్తామని వివరించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ హుద్ హుద్ గృహాలు పై ముఖ్యమంత్రితో మాట్లాడి వీలైనంత త్వరగా లబ్ధిదారులకు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, సర్పంచ్ సూరాడ సూర్యం, హౌసింగ్ ఇన్ చార్జ్ పీడీ నగేష్ తహసీల్దార్ గణపతిరావు, ఇన్ చార్జ్ ఎంపిడిఓ ఈ. రఘు, మండల ఇంజనీరింగ్ అధికారులు, వై. ప్రదీప్ కుమార్, కనకేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాల్లో 'ఇది మంచి ప్రభుత్వం'

**ఇచ్ఛాపురం, సెప్టెంబర్ 25 (వార్త):** కూటమి ప్రభుత్వం 100 రోజులు పూర్తి చేసికొన్న ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం బాలకృష్ణాపురంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుమారి, సర్పంచ్ ప్రతినిధి లోహిదాస్, కోట రామారావు, జగ్గయ్య, రామోజీ కృష్ణయ్య సచివాలయ సిబ్బంది, రామకృష్ణ, వెంకటేష్, అశోక్, ఫిల్డ్ అసిస్టెంట్ గౌరీ, సి ఎఫ్ సరోజిని, ఐసీడీసీ సిబ్బంది,ఏ ఎన్ ఎం ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలం కేశుపురం గ్రామ పంచాయతీలో గల నీలాపుపుట్టుగ గ్రామంలో ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దక్కత డిల్లీరావు, డి కామేశ్వరరావు, నరేంద్ర రెడ్డి ,పురుషోత్తం, భీమరాజు శ్యాంసుందర్, నీలాద్రి, తిమ్మరాజు ,హరిక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## మడ్డువలస నీరు విడుదల



**వంగర, సెప్టెంబర్ 25 (వార్త):** మడ్డువలస ప్రాజెక్టు నుండి ప్రాజెక్టు లోనికి అదనంగా వస్తున్న 4174 క్యూసెక్కుల నీటిని నాగావళి, సువర్ణముఖీ నదులలోకి రెండు ప్రధాన గేట్లు ఎత్తి నీరు విడుదల చేశారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు కారణంగా విజయనగరం, మన్యంపార్వతీపురం, జిల్లాల్లో వర్షాలవలన మడ్డువలస డ్యాంలోకి 4134 వేల క్యూసెక్కుల వరద వచ్చి ప్రాజెక్టులో నీరు చేరుతుందని సంబంధిత సిబ్బంది తెలిపారు. మడ్డు వలస కుడి ప్రధాన కాల్వ ద్వారా సాగు నీరు ను పొలాలకు విడచిపెడుతున్నారు.ఎడమ ప్రధాన కాల్వ నుండి పంట పొలాలకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో నిల్వ ఉండవలసిన నీటి కంటే అధికంగా ఉండటంతో ఈ నీటిని బయటకు విడుదల చేస్తున్నారు. డ్యాంలో65 మీటర్ల నీటిమట్టం ఉండాల్సి ఉండగా మడ్డువలస అధికారులు ప్రాజెక్టులో 64.20 మీటర్ల లోతు నీరు నిల్వ ఉంచుతున్నారు. నీటిమట్టం పెరిగినట్లయితే మరికొన్ని గేట్లు ఎత్తి నీరు విడుదల చేయడం జరుగుతుందని ఇంజనీర్లు తెలిపారు.

## డ్రోన్ల సాయంతో వ్యవసాయ యాంత్రీకరణ




**ఇచ్ఛాపురం, సెప్టెంబర్ 25 (వార్త):** బెల్లుపడ, బిర్లంగి గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు క్షేత్ర స్థాయిలో గమనించిన తెగులు, చీడ పీడల నివారణ కు తీసుకోవలసిన జాగ్రత్తలు అలాగే సకాలం లో ఎరువుల యాజమాన్యం ధ్వారా కలిగే లాభాల గురించి మండల వ్యవసాయ అధికారి భార్గవి రైతులకు వివరించారు.ఈ -పంట ప్రాముఖ్యత,వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా డ్రోన్స్ ఉపయోగం, నానో యూరియా, నానో డి ఏ పి వాడకం మొదలైన విషయాలు గూర్చి రైతులకు వివరించారు. సేంద్రియ పద్దతి లో చీడ పిడలు ఇంకా తెగులు ఎలా నీవారించాలో ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇంచార్జి చిట్టీ బాబు వివరించారు.వేటర్నరీ మరియు ఫిషరీస్ లో ప్రస్తుత%శీ% జరిగే స్కీమ్స్ గూర్చి వివరించారు. కార్యక్రమంలో మండల ఇరిగేషన్ అధికారి పాణిగ్రహి,, కౌన్సిలర్ -లీల రాణి, సర్పంచ్ ప్రతినిధులు రైతులు పాల్గొన్నారు.

## డైలీ మార్కెట్ వర్తకులతో ప్రతిజ్ఞ



**ఇచ్ఛాపురం, సెప్టెంబర్ 25 (వార్త):** మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛతా హే సేవా కార్యక్రమంలో భాగంగా బుధ వారం డైలీ మార్కెట్ పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. అనంతరం మార్కెట్ వర్తకులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ ఉపేంద్ర కుమార్, సచివాలయం వార్డ్ శానిటేషన్ ఎన్విరాన్మెంట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక





## భూసమస్యలు పరిష్కరించండి

**పలాస, సెప్టెంబర్ 25(వార్త):** బొడ్డపాడు, రామకృష్ణపురం రెవెన్యూ పరిధిలో ఉన్న భూ సమస్యలు పరిష్కరించాలని బొడ్డపాడు సర్పంచ్ తామాడ మదన్, ఎంపీటీసీ మద్దిల పాపారావు, మాజీ సర్పంచ్ బొడ్డు సుధాకర్, మాజీ ఎంపీటీసీ మద్దిల రామారావు, తదితరులు బుధవారం పలాస ఆర్డీవో డాక్టర్ భరత్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొడ్డపాడు రైతులకు నేటికీ నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. బొడ్డపాడులో 152.5 ఎకరాల భూమి కోల్పోయిన రైతులను ఆదుకోవాలన్నారు. అలాగే రామకృష్ణాపురం రెవెన్యూ పరిధిలో తీసుకున్న ఆర్ ఆర్ కోలనీకి తీసుకున్న 50 ఎకరాలకు పరిహారం ఇవ్వాలని కోరారు. త్వరలో పరిహారం అందించేలా చూస్తామనం ఆర్డీవో హామీ ఇచ్చారు.



## తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు

**బూర్జ, సెప్టెంబరు25(వార్త):** రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేందుకే పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుందని మండల వ్యవసాయ అధికారి యన్.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గుత్తావల్లి, వావాం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువులు తక్కువ మోతాదులో ఉపయోగించి సేంద్రీయ ఎరువులపై దృష్టి సారించాలన్నారు. వర్షాలు అనుకూలంగా ఉన్నప్పటికీ ఎరువులు అధికంగా ఉపయోగిస్తే దోమపోటు వచ్చే అవకాశముందన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని డిసెంబరు వరకు నిర్వహించటం జరుగుతుందని, వారంలో మంగళ, బుధవారాల్లో క్షేత్రస్థాయిలో వరిపొలాలను పరిశీలించి, రైతులకు అవగాహన కల్పించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వావాం సర్పంచ్ మంజు, అభ్యుదయ రైతులు సూరిబాబు, సతీష్, ఈశ్వరరావు, సూరపునాయుడు, గ్రామ వ్యవసాయ సహాయకులు కృష్ణ, శ్రీను, గౌతమి, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## తమ్మినేనిని సత్కరించిన సరుబుజ్జిలి నేతలు



**ఆమదాలవలస, సెప్టెంబర్ 25(వార్త):** శ్రీకాకుళం పార్లమెంటరీ పార్టీ నియోజకవర్గ పరిశీలకులుగా నియమితులైన మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను సరుబుజ్జిలి మండల వైసీపీ నేతలు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. దుశ్శాలువతో సత్కరించారు. సన్మానించిన వారిలో ఎంపీపీ కేవీజీ సత్యనారాయణ, జడ్పీటిసి సురవరపు నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు బెవర మల్లేశ్వరరావు, వైస్ ఎంపీపీ శివానంద బాబు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కొవిలాపు చంద్రశేఖర్, మండల సర్పంచ్లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## కొత్తవలసలో.. ఇది మంచి ప్రభుత్వం


**ఆమదాలవలస, సెప్టెంబర్ 25(వార్త):** తొగరాం సచివాలయ సిబ్బంది ప్రియాంక, సత్య సాయి, రాంబాయి ఆధ్వర్యంలో కొత్తవలస గ్రామంలో ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం వంద రోజుల్లో చేపట్టినటువంటి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు వివరించడంతోపాటు స్టిక్కర్లు అతికించే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గురుగుబెల్లి మోహనరావు గ్రామ పెద్దలు బగాది శ్రీనివాసరావు గురుగుబెల్లి తులసీరావ్ తమ్మినేని జగదీశ్వరరావు జి.ప్రసాదరావు కూన మురళి, కూటి కుప్పల సురేష్ కుమార్, రోణంకి అప్పన్న, దవల అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర ఎరువులు, సస్యరక్షణపై శిక్షణ

**ఆమదాలవలస, సెప్టెంబర్ 25(వార్త):** సమగ్ర ఎరువులు, సస్యరక్షణపై కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. వరిని ఆశించే సుడి దోమ, పొడతెగులు నివారణపై శాస్త్రవేత్త ఎస్.అనూష రైతులకు పవర్ పాయింట్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎస్. నీలవేణి, హేమలత, రైతులు పాల్గొన్నారు.

## బిజెపి టెక్కలి సభ్యత్వ నమోదు ఇంచార్జిగా సిరిపురం

**పాతపట్నం, సెప్టెంబర్ 25 (వార్త):** పాతపట్నం నియోజకవర్గ బిజేపి సీనియర్ నాయకులు సిరి పురం తేజేశ్వరరావు టెక్కలి నియోజకవర్గ బిజేపి సభ్య త్వ నమోదు ఇన్చార్జిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా టెక్కలిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధ వారం ఆయన పరిశీలించారు. సిరిపురంతోపాటు అట్టాడ రవి బాబ్జి నందిగాం మండలంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.





# రోడ్డెక్కిన రైతన్నలు

- భూములు రీసర్వే చేయాలని నినాదం
- తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ
- మండల అధికారులకు వినతిపత్రం

**కొత్తూరు, సెప్టెంబరు25 (వార్త):** భూములు రీసర్వేలో అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకొని భూ యజమానులకు న్యాయం చేయాలని కోరుతూ కర్లెమ్మ గ్రామ రైతులతో కలిసి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్ బుధవారం కొత్తూరు మండల కేంద్రంలో ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిర్ల ప్రసాద్ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా జాయింట్ కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. భూములు రీ సర్వేలో నష్టపోయిన రైతులందరిని ఆదుకోవాలన్నారు. అనంతరం మండలంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద పెద్ద ఎత్తున మానవహారం చేపట్టి మండల తహశీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ బి.పాపారావుకి రైతు నాయకులు లోతుగెడ్డ భగవాన్ దాసునాయుడు, గేదెల క్రిష్ణారావు, కర్లెమ్మ మాజీ సర్పంచ్ ఎ.కన్నంనాయుడులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ ర్యాలీ కార్యక్రమంలో కొత్తూరు ఎంపీటీసీ ప్రతినిధి ఆనందరావు, కె.సురేష్ నాయుడు, పెదకోట యతిరాజు, కర్లెమ్మ రైతులు పాల్గొన్నారు.

# దీన దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు


**బూర్జ, సెప్టెంబరు25(వార్త):** ఆర్ఎస్ఎస్ మాజీ అధ్యక్షుడు, భారతీయ జనతా పార్టీ హైందవ రాష్ట్రం సిద్ధాంత కర్త పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను బూర్జ మండల అధ్యక్షుడు పిళ్ళా జగన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా దీనదయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జగన్ మాట్లాడుతూ ప్రతి మానవుడి శరీరం, మనస్సు, తెలివితేటలు, ఆత్మ యొక్క ఏకకాల సమగ్ర కార్యక్రమాన్ని సూచించే సమగ్ర మానవతావాదం అనే రాజకీయ తత్వాన్ని దీన దయాళ్ ఉపాధ్యాయ రూపొందించారన్నారు. వికేంద్రీకృత రాజకీయ వ్యవస్థ, స్వావలంబన గల ఆర్థిక వ్యవస్థలు గ్రామాభివృద్ధికి ప్రధాన ఆధారం అని దీనదయాళ్ భావించాడని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి కార్యకర్తలు పైల ఆసిరి నాయుడు, మేడి దుర్గాప్రసాద్, తారకేశ్వరరావు, బి.సంతోష్, గంగరాజు పాల్గొన్నారు.

**పాతపట్నం:** పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను బుధవారం పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలో బీజేపీ నేత సిరిపురం తేజేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. దీన్ దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు తాడేల



భూపతి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

**ఇచ్ఛాపురం:** జన్ సంఘ్ వ్యవస్థాపకులు పండిట్ దీన దయాల్ ఉపాధ్యాయ జయంతిని స్థానిక వీకేపీ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం నిర్వహించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి వీకే ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రామ్మూర్తి, కృష్ణమూర్తి, మోహన్, భగవాన్, నీలవేణి, రుక్మాంగధర్ తదితరులు పాల్గొన్నారు.





## పలు కుటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ

**మందస, సెప్టెంబరు 25 (వార్త):**

మందస మండలంలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు బుధవారం పర్యటించారు. పలువురిని పరామర్శించారు. పిడిమందస గ్రామానికి చెందిన ఉగ్గిరపల్లి ఆదినారాయణ, బెల్లుపటియాకు చెందిన సంక గురుమూర్తి ఇటీవల మరణించగా పార్టీ నాయకులతో కలిసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న సువర్ణపురంలో బంగారి చిన్నారావు, కొత్తపల్లి ఊర్వశి, చుక్క తిరుపతి రావు, దాలమ్మ, ఇప్పిలి కామేశ్వరిలను పరామర్శించారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు కూడా పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి

**మందస, సెప్టెంబరు 25 (వార్త):** జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాల స్థాయి చెకుముకి సంబరాల ప్రశ్నాపత్రాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ హరిపురం ఇన్ చార్జ్ ప్రధానోపాధ్యాయుడు లఖినాన సాంబమూర్తి, మార్పు చక్రధరరావు, ఉపాధ్యాయులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏట జన విజ్ఞాన వేదిక పాఠశాల విద్యాశాఖ సహకారంతో చెకుముకి సంబరాలను పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తూ విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి ఎనలేని కృషి చేస్తుందని తెలియజేశారు. పాఠశాల స్థాయిలో ఎంపికైన విద్యార్థులతో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ అక్టోబర్ 1వ తేదీన హరిపురంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జి.రమణబాబు , జి.తేజేశ్వరరావు, జి.కోదండరావు, పి.జగన్మోహన్ రావు, కె.శేషగిరిరావు, ఎస్.ప్రభాకర రావు, ఎస్.రేణుక, ఎస్.స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# టెక్కలిలో ఉద్యాన శాఖ రెండో కార్యాలయం

*** ఫలించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్న కృషి * జీవో విడుదల చేసిన ప్రభుత్వం**

**టెక్కలి, సెప్టెంబర్25(వార్త):** జిల్లా పునర్వ్యవస్థీకరణలో భాగంగా పాడేరుకు తరలిపోయిన టెక్కలిలో ఉన్న ఉద్యానవన శాఖ కార్యాలయం తిరిగి ఏర్పాటైంది. ఉద్దానంలో ఉన్న వేలాది హెక్టార్ల ఉద్యానవన పంటలకు ఊతమిచ్చేలా మళ్లీ టెక్కలిలోనే అదే కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు వ్యవసాయ, ఉద్యానవన శాఖామంత్రి అచ్చెన్నాయుడు చేసిన కృషి ఫలించింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే టెక్కలిలో ఉద్యానవన శాఖ ఏడి కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని లిఖితపూర్వకంగా కోరారు. ఆయన చొరవతో వంద రోజులలోనే ఇక్కడ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం బుధవారం సాయంత్రం జీవో విడుదల చేసింది. ఇప్పటివరకు అన్ని జిల్లాల్లో జిల్లాకు ఒక ఉద్యాన శాఖ కార్యాలయం మాత్రమే ఉండగా, వ్యవసాయ మంత్రి ఇలాకాలో రెండు కార్యాలయాలు ఉండటం విశేషం. జిల్లాలో ప్రధానంగా ఉద్దాన ప్రాంతమైన ఏడు మండలాలు టెక్కలి ప్రాంతానికి దగ్గరగా ఉండటం, ఇక్కడ



ముఖ్యమైన కొబ్బరి, జీడిమామిడి, పనస, మునగ మొదలైన రైతులందరూ ఉద్దాన ప్రాంతంలో ఎక్కువగా ఉండటం వలన ఇక్కడికి ప్రత్యేకంగా ఒక ఉద్యాన శాఖ కార్యాలయం కావాలని మంత్రి ప్రయత్నాలు చేసి సఫలీకృతం అయ్యారు. జిల్లాకు ఉద్యాన శాఖలో రెండవ కార్యాలయం టెక్కలిలో రావడంపై ఉద్దాన ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉద్దాన ప్రాంతంలో ఉన్న కవిటి, కంచిలి, సోంపేట, మందస, పలాస వజ్రపు కొత్తూరు మొదలైన మండలాల్లో రైతులు తమకు సత్వరమే ఉద్యాన శాఖ నుంచి రావాల్సిన పథకాలు, చీడపీడల నివారణ కార్యక్రమాలు మొదలైన అంశాలన్నీ త్వరగా తమకు అందుతాయని ఉద్దాన రైతులు మాదిన రామారావు, వెంకటేశ్వర, శివాజీ, భాస్కర రావు తదితరులు హర్షాతికేరాలు వ్యక్తం చేశారు. జిల్లాకు రెండవ ఉద్యానవన శాఖ కార్యాలయం ఏర్పాటు హర్షణీయమైనదని జిల్లా ఉద్యాన అధికారి రత్నాల వరప్రసాద్ ఆనందం వ్యక్తం చేశారు. టెక్కలిలో ఉద్యాన కార్యాలయం ఉండటంవల్ల ఉద్యాన రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని అధికారులు అందరూ రైతులకు అందుబాటులో ఎల్లవేళలా ఉంటారని అదేవిధంగా రైతులకు సత్వరమే ఉద్యాన పథకాలు ఇవ్వడానికి అవకాశం ఉంటుందని ఆయన తెలియజేశారు. శాఖలో రాష్ట్రంలో ఇప్పటివరకు ఒక జిల్లాకు ఒక కార్యాలయం మాత్రమే ఉన్నా సరే శ్రీకాకుళం జిల్లాకు రెండో కార్యాలయం మంజూరు కావడం హర్షణీయమని , మంత్రి అచ్చెన్నాయుడు కృషి వెలకట్టలేనిదని ఆయన చెప్పారు.

# కొత్తమ్మతల్లి ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

*** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు**
*** అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం**

**టెక్కలి, సెప్టెంబర్25 (వార్త):** కొత్తమ్మతల్లి ఉత్సవాలకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. బుధవారం కోటబొమ్మాళి మండలంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆయన ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలు సమర్థవంతంగా నిర్వహించి అందరూ సమన్వయంతో అంగరంగ వైభవంగా పండగ నిర్వహించాలన్నారు. సామాన్య భక్తులు సులభతరంగా అమ్మవారి దర్శనానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు జారీ చేశారు. కోటబొమ్మాళి పాఠశాల ఆవరణలో స్వర్గీయ కింజరాపు ఎర్రన్నాయుడు పేరిట



పోడియం ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చెప్పారు. పాఠశాల ప్రాంగణంలో స్థలం పరిశీలించారు. ఆయన వెంట అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు

**వంగర, సెప్టెంబర్25 (వార్త):** వరి సాగులో రైతులు సాంకేతిక పరిజ్ఞానంతో మెలకువలు పాటిస్తే అధికంగా పంట దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయాధికారి టి.కన్నబాబు చెప్పారు. బుధవారం ఆయన పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని మండలంలో తలగాం,శివ్వాం గ్రామాల్లో నిర్వహించారు. తదనంతరం మండల వ్యవసాయధికారి తట్టికోట కన్నబాబు రైతులతో పంట పొలాలను పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. వరి సాగులో రైతుల ఆదాయాన్ని పెంచేందుకే పొలం పిలుస్తోంది కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని కన్నబాబు అన్నారు. లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయాన్ని విస్తారంగా పండిస్తున్న ఇక్కడ ఈ కార్యక్రమం వల్ల రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతిక సమాచార పరిజ్ఞానాన్ని చేరువ చేయుటకు పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. వ్యవసాయ అనుబంధ శాఖల పథకాలపై అవగాహన కల్పిస్తూ, తక్కువ పెట్టుబడి తో అధిక ఉత్పత్తి నికర ఆదాయం పెంపొందించడమే దీని లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయాగ్రామాల పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

# శ్రీవారి ప్రసాదం అపవిత్రం చేశారు

*** ప్రాయశ్చిత్త దీక్ష చేసిన జనసేన శ్రేణులు**

**మందస, సెప్టెంబరు 25 (వార్త):** తిరుమల-తిరుపతి దేవస్థానంలో పరమ పవిత్రమైన శ్రీవారి మహాప్రసాదం లడ్డూ తయారీలో ఆవు నెయ్యికి బదులు జంతువుల కొవ్వు వాడి భక్తుల మనోభావాలను దెబ్బతీశారని జనసేన నాయకులు అన్నారు. తిరుమల లడ్డూ కల్తీ ఘటనను నిరసిస్తూ జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 11 రోజుల పాటు ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా పలాస నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త డాక్టర్ వి.దుర్గారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్ పండా, మందస మండల అధ్యక్షుడు గోపాలరావు, కోన కృష్ణారావు, దువ్వాడ వంశీకృష్ణ చౌదరిలతో కలిసి మందస పట్టణంలోని వాసుదేవ పెరుమాళ్ దేవాలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మేడిశెట్టి నరసింహమూర్తి, కీలు సుధాకర్ వర్మ, రౌతు చిరంజీవి, బుడుకు సురేష, పీరికట్ల హేమసుందర, వెంకటరమణ, కిల్లి బాలకృష్ణ, తెలుకుల సందీప్, పందిరి నీలయ్య, జనపాన గణేష్ రెడ్డి, రందీ వైకుంఠ రావు, గొల్లూరు వేణు, రొతీయ చక్రి, సవర శివకుమార్, వాడ్రేవు అశోక్ కుమార్, జనసేన నాయకులు, వీర మహిళలు కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రాయశ్చిత్త దీక్ష అనంతరం డాక్టర్ దుర్గారావు మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో తిరుమల ప్రతిష్టను దెబ్బతీసే విధంగా పరిపాలన సాగించిందని, ఇందుకు నిదర్శనమే ప్రపంచంలోనే హిందువులందరి ఆరాధ్య దైవమైన తిరుమల వెంకటేశ్వర స్వామి మహా ప్రసాదం లడ్డూల తయారీలో జంతువుల కొవ్వును ఉపయోగించి హిందువుల మనోభావాలను పూర్తిగా దెబ్బ తీశారన్నారు. నేషనల్ డైరీ డెవలప్మెంట్ బోర్డ్ సంస్థ, సీఏఎల్ఎఫ్ ఆధ్వర్యంలో పరీక్షలు చేసి నెయ్యి కల్తీ అయిందని అందులో జంతువులు కొవ్వు ఉన్నదని నిర్ధారించారన్నారు. సనాతన ధర్మాన్ని అంతం చేయాలనుకున్న వారందరూ అంతమయ్యేరే తప్ప, సనాతన ధర్మం మాత్రం నిత్య నూతనంగా వ్యవహరిస్తుందని, ఇది సనాతన ధర్మశక్తి అన్నారు. జగన్మోహన్ రెడ్డి చేసిన తప్పుకు పశ్చాతాపం చూపించకపోగా బుకాయిస్తున్నాడని ఇటువంటి నియంతకు దేవుడు కచ్చితంగా శిక్ష విధిస్తాడన్నారు. తిరుమల లడ్డు తయారీలో జరిగిన అవకతవకలపై సిట్‌ను వేశారని బాధితులకు కచ్చితంగా శిక్ష పడుతుందన్నారు.





## పల్లవి, సాయి తారక్‌కు అభినందన

**శ్రీకాకుళం/ ఎచ్చెర్ల, సెప్టెంబరు 25 (వార్త):** ఫెన్సింగ్ తైక్వాండో పోటీలో ఉత్తమ ప్రదర్శన కనపరచిన పల్లవి, సాయి తారక్‌కు రాజీవ్ గాంధీ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బాలాజీ అభినందించారు. రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఐఐఐటి విద్యార్థిని సి.హెచ్.పల్లవి, సాయితారక్ పియుసి ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈనెల 23, శ్రీకాకుళం జరిగిన ఎస్జిఎఫ్ ఫెన్సింగ్ తైక్వాండో పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రదర్శన కనపరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై పల్లవి, సాయితారక్ ఐఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ బాలాజీ అభినందనలు తెలిపారు. పల్లవి, సాయితారక్ ఇంకా ఉన్నతమైన స్థాయికి చేరుకొని మరిన్ని విజయాలు సాధించి యూనివర్సిటీకి మంచి పేరు తీసుకుని రావాలని ఆకాంక్షించారు. ఐఐఐటి ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం శిక్షకులు రాజు, దిలీప్ కుమార్, విద్యార్థులకు మంచి శిక్షణ అందజేస్తున్నారన్నారు. మరింత మెరుగైన శిక్షణ ఇచ్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోకి స్థానాలను కైవసం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్ కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ మోహనరావు, డీన్ వెల్ఫేర్ గేదెల రవి, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం సిబ్బంది రాజు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ భారత్‌లో భాగస్వాములు కావాలి




**శ్రీకాకుళం టౌన్, సెప్టెంబర్ 25 (వార్త):** మహాత్మా గాంధీజీ కలలు కన్న స్వచ్ఛమైన దేశ అభివృద్ధి లక్ష్య సాధన లో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ భారత్ లో ప్రతి ఒక్కరం భాగస్వామ్యం అవుదామని జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు అన్నారు. బుధవారం అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానంలోని పుష్కరణిలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని అరసవల్లి గవర్నమెంట్ స్కూల్, శర్వాణి విద్యానికేతన్ యువ క్లబ్ విద్యార్థిని విద్యార్థులతో కలిసి నిర్వహించారు. పుష్కరిణి పరిసర ప్రాంతాలలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. జిల్లా పర్యాటక అధికారి ఎన్ .నారాయణరావు మాట్లాడుతూ సెప్టెంబర్ 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా యువ క్లబ్ విద్యార్థిని విద్యార్థులతో పలు కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. అలాగే ప్రతీ ఒక్కరికి పచ్చదనం-పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, నీటి వినియోగం, స్వచ్ఛ సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ జ్యోతిర్మయి, శర్వాణి విద్యానికేతన్ సిబ్బంది, డి.రమేష్ పాల్గొన్నారు.

## వెంకటేశ్వర ఫార్మసీ కళాశాలలో రక్తదాన శిబిరం

**ఎచ్చెర్ల, సెప్టెంబర్ 25 (వార్త):** ఎచ్చెర్ల వెంకటేశ్వర ఫార్మసీ కళాశాలలో బుధవారం ప్రపంచ ఫార్మసిస్టల దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాలలో శ్రీకాకుళం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు, ఫార్మసీ కళాశాల దర్శకుడు డా.బి.శ్రీరామమూర్తి మాట్లాడుతూ గడిచిన కొద్ది కాలముగా రక్తనిధి కేంద్రాలలో రక్తం నిల్వలు చాలా తక్కువ ఉంటున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. 80మంది విద్యార్థులు రక్తం దానం చేశారు. వీరికి రెడ్‌క్రాస్ సొసైటీ తరఫున సర్టిఫికెట్, డోనార్ కార్డ్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పద్మశ్రీ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ తారక రామారావు, కళాశాల ఫార్మా డి హెచ్.ఓ.డి డాక్టర్ పైల బానోజీరావు, కళాశాల యాజమాన్యం, రెడ్ క్రాస్ జాతీయ యువజన అవార్డు విజేత పెంకి చైతన్య, సిబ్బంది, రెడ్ క్రాస్ వాలంటీర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం









# ప్రభుత్వం దృష్టికి..
# తోటాడ భూ సమస్య

* ఈ భూములు 22ఏ లో లేదు.. ఇవి జిరాయితీయే
* ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రిని కలిసి సమస్యను వివరిద్దాం
* వంద రోజుల్లోనే అనేక సంక్షేమ పథకాలు అమలు చేశాం
* పంచాయతీల్లో మౌలిక సదుపాయాలు కావాలంటే ట్యాక్స్ కట్టండి
* తోటాడ, అక్కివరం పంచాయతీల్లో సమస్యలు పరిష్కరిస్తాం
* నాకు ఎటువంటి ట్యాక్సులు కట్టనక్కర్లేదు
* ఎమ్మెల్యే కూన రవికుమార్
* తోటాడ, అక్కివరంలో 'ఇది మంచి ప్రభుత్వం'







**శ్రీకాకుళం, సెప్టెంబర్25 (వార్త):** తోటాడ భూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా తనవంతు కృషి చేస్తానని ఆమదాలవలస నియోజకవర్గ ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. గతంలో ఇదే విషయమై కలెక్టర్ దృష్టికి సైతం తీసుకువెళ్లామని, ఈ భూములకు సంబంధించిన యజమానుల నుంచి సరైన సహకారం లేకపోవడంతో ఈ సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. బుధవారం ఆమదాలవలస మండలంలోని అక్కివరం, తోటాడ పంచాయతీల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత కొత్తరోడ్డు వద్ద టీడీపీ నేతలు మూల రాము, తాండ్ర హరిబాబు, బెండి రాము, సనపల రుషి, పొన్నాడ గణపతి, సనపల సుధా, వెంకటరావు, మూర్తి తదితరులు ఎమ్మెల్యే కూన రవికి ఘన స్వాగతం పలికారు. పూలదండ వేసి ఆహ్వానం పలికారు. అక్కడి నుంచి ర్యాలీగా తోటాడకు ఎమ్మెల్యే కూన రవి, టీడీపీ శ్రేణులు వెళ్లారు. తోటాడలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనపై ప్రజలకు వివరించారు. ప్రతి ఇంటికి స్టిక్కర్లను అంటించారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం అక్కివరంలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. తోటాడ రెవెన్యూ పరిధిలో 220 ఎకరాల భూమి 22ఏలో లేదని, 22ఏ1డీలో ఉందని చెప్పారు. ఈ భూమి జిరాయితీ అని చెప్పారు. ఇది ప్రభుత్వ భూమి కాదని, అయితే గతంలో సర్వే చేసినపుడు యజమానుల విషయంలో సరైన స్పష్టత లేకపోవడంతో ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూమిగా పరిగణింపబడిందని చెప్పారు. గతంలో కూడా ఇదే విషయమై రైతులతో మాట్లాడడం జరిగిందన్నారు. అప్పట్లోనే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి ఈ సమస్యను పరిష్కరించాలని కోరామన్నారు. కొందరి వల్ల ఈ సమస్య పరిష్కారం కాలేదన్నారు. రైతులతో కలిసి ఈ సమస్యను ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా తనవంతు చొరవ చూపుతానన్నారు. దీనికి మీరంతా తనకు ఎటువంటి ట్యాక్సులు చెల్లించనవసరం లేదన్నారు. గతంలో టీ ట్యాక్స్ ఉండేదని, ఇప్పుడు అటువంటిదేమీ ఉండదని కూన రవి అన్నారు. పంచాయతీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలంటే హౌస్ ట్యాక్సులు కట్టాలన్నారు. కొందరు అనధికారికంగా ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారని, అటువంటి వారికి హౌస్ ట్యాక్సులు వేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఎమ్మెల్యే కూన రవి ఆదేశించారు. ప్రతి ఒక్కరూ ట్యాక్సులు కడితేనే ఆ పంచాయతీ అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వంద రోజులు అయినందున 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం చేపడుతోందన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని చెప్పారు. ఆ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాండ్ర హరిబాబు, హనుమంతు నారాయణరావు, బెండి రామ్మోహనరావు, పొన్నాడ గణపతి, సర్పంచ్ ప్రతినిధి నీలారావు, హనుమంతు బాల, బుడుమూరు సీతారాం, తమ్మినేని చంద్రశేఖర్, నూక రాజు, సనపల డిల్లేశ్వరరావు, కూన అమ్మాజమ్మ, మూల రాము, హనుమంతు బాలకృష్ణ, దువ్వాడ శ్రీను, లక్ష్మణరావు, సనపల రుషి, సనపల సుధా, జనసేన ఆమదాలవలస నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేరాడ రామ్మోహన్‌నాయుడు, కొర్లకోట ఎంపీటీసీ అన్నెపు భాస్కరరావుతో పాటు కూటమి నాయకులు, తహశీల్దార్, ఈవోఆర్‌డీ దుంపల గోవిందరావు, సర్వేయర్ గోపి, అక్కివరం, తోటాడ పంచాయతీ కార్యదర్శులు బెహర హిమబింధు, సీపాన హరీష్, సచివాలయ సిబ్బంది, తోటాడ, అక్కివరం గ్రామస్థులు పాల్గొన్నారు.






Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413